# కోదండరామ ఆలయ పరిసరాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

• పనులను పర్యవేక్షించిన మున్సిపల్ ఛైర్మన్ ఆకాష్, వైస్ ఛైర్మన్ ఎండీ అహ్మద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని జనకాపూర్లోని శ్రీ కోదండరామ ఆలయం వద్ద మంగళవారం మున్సిపల్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ ఛైర్మన్ ఆకాష్, వైస్ ఛైర్మన్ ఎండి అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గజానంద్, స్థానిక కౌన్సిలర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ ఆకాష్, వైస్ ఛైర్మన్ ఎండీ అహ్మద్ మున్సిపల్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వేడుకల కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండు భారతి, చిలువేరు వెంకటేశ్వర్లు, జాడి వినోద్, నాయకులు సిహెచ్ రవి, శైలేష్, గుండా శ్యాంలతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వాంకిడి వారసంత వేలంపాట రూ. 9.51 లక్షలకు కైవసం




**ఉద్యమ కెరటం, వాంకిడి :** మండల కేంద్రంలో ప్రతి జరిగే వారంతపు సంతకు సంబంధించిన వేలం పాటను మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఏడాది సంత వేలం ద్వారా గ్రామ పంచాయతీకి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఆదాయం గణనీయంగా పెరగడం విశేషం.గత ఏడాది రూ. 8.49 లక్షలు పలికిన సంత, ఈ సంవత్సరం ఏకంగా రూ. 9.51 లక్షల ధర పలికిందని గ్రామ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఆసిఫాబాద్‌కు చెందిన శంకరయ్య వేలం పాటలో అత్యధిక ధర పాడి సంత హక్కులను దక్కించుకున్నారు. వేలం ప్రక్రియ పారదర్శకంగా ముగియడంతో గ్రామ పంచాయతీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

# ఆసిఫాబాద్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** అమరవీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ ల త్యాగాలను స్మరిస్తూ డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుండి గుండి గ్రామానికి వెళ్లే దారిలో వెంటనే 'భగత్ సింగ్ చౌక్' ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం-2020ని రద్దు చేయాలని, నిరుద్యోగుల కోసం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు. అలాగే జిల్లాలో యువతను పట్టిపీడిస్తున్న గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ ఆశయాలతో భవిష్యత్తులో శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాజ్ కుమార్, దినకర్, రాజేందర్, హరి, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైలు కింద పడి వివాహిత ఆత్మహత్య



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలంలోని ఐబీ చౌరస్తా సమీపంలో గల రైల్వే ట్రాక్ పై మంగళవారం ఉదయం బెల్లంపల్లి సుభాష్ నగర్ కు చెందిన ఫర్హానా (29 )అనే వివాహిత గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు బెల్లంపల్లి రైల్వే హెడ్ కానిస్టేబుల్ కే తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలికి మతిస్థిమితం సరిగా లేదని, ఆమెకు ఇద్దరు కొడుకులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు బెల్లంపల్లి జిఆర్ పి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

• జిల్లా కలెక్టర్ హరిత



**ఉద్యమ కెరటం, పెంచికల్ పేట్:** వైద్యం కొరకు వచ్చేవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు రిజిస్టరు, మందుల నిల్వల గదిని ఆపరేషన్ థియేటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు వైద్య సిబ్బంది సమయపాలన పాటించి వైద్యం కొరకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సమయపాలన, అనుమతి, లేకుండా గైర్ హాజరు అయ్యే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించి విద్యార్థుల హాజరు పట్టిక, మెను పట్టిక, సరుకుల నిల్వల గది,వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని మెను ప్రకారం పెట్టాలన్నారు. విద్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన బోధనను అందించి, విద్యార్థుల ఆరోగ్యం పై దృష్టి సారించాలని విద్యార్థులకు అర్థమయ్యే పద్దతిలో బోధించాలన్నారు. అంతకుముందు మండలంలోని బొంబాయి గూడా గ్రామంలో గల ఆదర్శ అంగన్వాడి కేంద్రాన్ని, ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అంగన్వాడి ఉపాధ్యాయురాలిని ఎంతమంది గర్భిణీ స్త్రీలు వున్నారు. వారిలో డెలివరీకి ఎంతమంది ఉన్నారు. వారికి క్రమం తప్పకుండా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఉపాధ్యాయురాలిని ఆదేశించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా శ్యాం, మామ్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీ యు పి ఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు రిజిస్టరును పరిశీలించారు. విద్యార్థులు 100% పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెను ప్రకారం అందించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే పద్దతిలో బోధించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రితో కౌన్సిలర్ల భేటీ

• కాగజ్‌నగర్ అభివృద్ధి నిధులపై చర్చ



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి నిధుల విషయమై కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు మంగళవారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ దండే విఠల్ నాయకత్వంలో జరిగిన ఈ సమావేశానికి మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ దస్తగిర్ ప్రతినిధి బృందాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్, షేక్ దస్తగీర్ కాగజ్‌నగర్ పట్టణ అభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇర్ఫాన్‌నగర్ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధికి అదనపు నిధులు మంజూరు చేయాలని కౌన్సిలర్ అన్వర్ సబ్రీ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్సీ దండే విఠల్, షేక్ దస్తగీర్ పర్యవేక్షణలో ప్రతి వార్డుకు అవసరమైన నిధులు కేటాయించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రిని కలిసి కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మొహమ్మద్ అబ్బాస్, కౌన్సిలర్ దుర్గం సూరజ్, అన్వర్ సబ్రీ, కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్, ఎమాజీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ యూనిట్‌ను సందర్శించిన డిగ్రీ విద్యార్థులు



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం కాగజ్‌నగర్ సమీపంలోని సేంద్రీయ, సమీకృత వ్యవసాయ యూనిట్‌ను క్షేత్ర స్థాయిలో సందర్శించారు. కళాశాలలోని ఎకో క్లబ్, భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఈ పర్యటించారు. విద్యార్థులు అక్కడి సేంద్రీయ సాగు పద్ధతులు, పర్యావరణహిత సాంకేతిక విధానాలపై అవగాహన పొందారు. జల్ జీవిక సెంటర్ ఫర్ ఆక్వాటిక్ లైవ్లీహుడ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ పద్మాకర్ సేంద్రీయ వ్యవసాయ విధానాల ప్రాధాన్యాన్ని వివరించారు. బీడు భూములను సైతం సాగులోకి తీసుకువచ్చి రసాయనిక ఎరువులు ఉపయోగించకుండా మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ రసాయనిక ఎరువుల అధిక వినియోగం ద్వారా భూసారం తగ్గే ప్రమాదం ఉందని, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యతను విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ దేవేందర్ వీరమల్ల, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఇ.శారద, వైస్ ప్రిన్సిపాల్ డి.లక్ష్మీనరసింహం, అకాడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్ధన్, లెక్చరర్లు రాజేశ్వర్, రోజ్ మేరి, నర్సింగరావు పాల్గొన్నారు.

# మెను ప్రకారం భోజనం అందించాలి

• జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం భీంపూర్ మండలం అందర్ బంద్ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గది, స్టోర్ రూమ్, భోజన శాల, వసతి గృహాలను పరిశీలించారు. ఎప్పటికపుడు రిజిస్టర్ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆర్‌ఓ ప్లాంట్ నీటి నాణ్యతను క్వాలిటీ మీటర్ తో కొలిచి చూశారు. స్టోర్ రూమ్ లో బియ్యం, గుడ్ల నాణ్యతను పరిశీలించి నాణ్యత లేని వాటిని తిరిగి పంపించాలని అందేశించారు. అనంతరం ఆర్ బి ఎస్ కె వైద్య బృందం అధికారులను విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ రమేష్, హెచ్ డబ్ల్యు ఓ జ్ఞానేశ్వర్, వైద్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు



# పశువులకు టీకాలు తప్పనిసరి వేయించాలి

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా తప్పనిసరి నివారణకు టీకాలు వేయించాలని రోల్ మామడ గ్రామ సర్పంచ్ తొడసం శంకర్ అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సామూహిక గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రోల్ మామడ గ్రామంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిభిరంలో పాల్గొని పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువులకు సోకే వ్యాధులు, వాటి నివారణ పట్ల రైతులకు పశు వైద్యాధికారి జీవన్ రాథోడ్ అవగాహన కల్పించారు. పశువుల్లో సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వెంటనే వైద్యం అందించి కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# సూలభ్ కాంప్లెక్స్‌కు నీటి సౌకర్యం



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** మండలంలోని కొమరం భీమ్ చౌరస్తా వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మిస్తున్న సూలభ్ కాంప్లెక్స్‌కు నీటి వసతి కల్పించేందుకు ఏర్పాటు చేసిన బోరుకు మోటారు అమర్చారు. ఈ కార్యక్రమాన్ని తిర్యాణి గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ చేని కుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు వివిధ గ్రామాలు, పట్టణాలకు రాకపోకలు సాగించేందుకు కొమరం భీమ్ చౌరస్తా వద్ద ఎక్కువ సమయం వాహనాల కోసం వేచి ఉండాల్సి వస్తుందని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సూలభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. నీటి సౌకర్యం కల్పించేందుకు బోరు ఏర్పాటు చేసి మోటారు అమర్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

# టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలి

**• జిలాల కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్‌ను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన "టీబీ ముక్త్ భారత్ అభియా న్" వంద రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని, స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు టిబి వ్యాధిగ్రస్తులు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 24 గ్రామాలను టీబీ రహిత గ్రామాలుగా ప్రకటించామని తెలిపారు. రెండు సంవత్సరాలుగా టిబి కేసులు లేని టక్కుగూడ గ్రామానికి 'సిల్వర్ మెడల్' లభించిందని పేర్కొన్నారు. వచ్చే ఏడాది నాటికి మరిన్ని గ్రామాలు గోల్డ్ మెడల్ సాధించేలా కృషి చేయాలని సూచించారు. క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం అత్యంత కీలకమని, దగ్గు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా కోలుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టి పంచాయతీలను బాల్య వివాహ రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని సర్పం చులకు సూచించారు. మహిళలందరికీ సమగ్ర ఆరోగ్య పరీక్షల కోసం త్వరలో ప్రత్యేక హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టిబి వ్యాధిగ్రస్తులకు కళావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిక్షయ్ మిత్ర కిట్లు పంపిణీ చేయడంతో పాటు టిబి నియంత్రణకు కృషి చేసిన సర్పంచ్‌లు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం టిబి నియంత్రణ అవగాహన ప్రచార వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. తదుపరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును సందర్శించి వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారులు సాధన, మనోహర్, టిబి ప్రోగ్రామ్ అధికారి సుమలత, తహశీల్దార్ రమేష్, ఎంపీడీఓ గోపాలకృష్ణ రెడ్డి, కళావతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అశోక్, వైద్యులు, రోగులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రంజన, లక్ష్మి, కోమల్, లత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళికపై ప్రత్యేక దృష్టి సారించాలి

**• అదనపు కలెక్టర్ చంద్రయ్య**



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య సూచించారు. మంగళవారం తాండూర్ మండల కేంద్రంతో పాటు కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న పారిశుధ్య పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి పది రోజులకు ఒకసారి శుభ్రపర్చాలని, మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇండ్లను త్వరగా నిర్మించుకునేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలోని నర్సరీని సందర్శించి వేసవి కాలంలో మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ తహశీల్దార్ జ్యోత్స్న, డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జైనూర్ పంచాయతీలో వారపు సంతల వేలంపాట



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే పశువుల సంత, బజార్ వారపు సంతలకు సంబంధించిన వేలం పాటను మంగళవారం జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కొడప ప్రకాష్ అధ్యక్షత వహించారు. వేలం పాటలో పాల్గొన్న వారు పోటాపోటీగా బిడ్లు వేయగా, పశువుల సంతను కొడప సోనేరావు రూ.18 లక్షల 30 వేలుకు దక్కించుకున్నారని సర్పంచ్ కొడప ప్రకాష్, పంచాయతీ ఈవో ఆనందరావు తెలిపారు. అయితే బజార్ సంతకు సరైన ప్రభుత్వ రుసుము రాకపోవడంతో ఆ వేలం పాటను వాయిదా వేశారు. తిరిగి ఈనెల 25వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేలం పాట 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వారపు సంతల కాంట్రాక్ట్‌గా నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండల పంచాయతీ అధికారి భూఖ్య శశికుమార్, ఉప సర్పంచ్ డోంగ్రే ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ అబ్దుల్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# కష్టపడే వారికే పార్టీలో గుర్తింపు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీలో జిల్లా సెక్రటరీగా నియమితులైన షేక్ ఇమామ్ మంగళవారం మావలలో శ్రీకాంత్ రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి కూడా షేక్ ఇమామ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత కష్టపడి పనిచేసి పార్టీలో ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతుల కళ్లలో ఆనందం నింపిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంతింటి కలను సాకారం చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ ఏఎంసీ వైస్ చైర్మన్ శేషరావు, సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తు, సుంకిడి సర్పంచ్ రాథోడ్ గణపతి, సిరికొండ ఉప సర్పంచ్ తోకల రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఇమామ్, అధ్యక్షులు సదానందం, మాజీ సర్పంచ్ షేక్ బషీర్, ఈశ్వర్, సందీప్, రామారావు, అలాం, సీనియర్ నాయకులు శేబ్బీర్, అజగర్, లస్మన్న, కంచం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ఉద్యమ కెరటం, వేంసూర్:** మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వేంసూర్ ఎస్సై కవిత అన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై మంగళవారం వేంసూర్ మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జెడ్పిహెచ్ పాఠశాల విద్యార్థులు, గ్రామ ప్రజలకు హైదరాబాద్ డ్రగ్స్ కంట్రోల్ ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడుంబా, బెల్లం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం ద్వారా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగితేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాధు లక్షి , ఉప సర్పంచ్ పాల గంగాధర్ రెడ్డి, స్థానిక తహశీల్దార్, ఆరోగ్యశాఖ అధికారులు, ఆశా వర్కర్లు, మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పాల వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# 108 అంబులెన్స్‌లో సుఖ ప్రసవం



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని జెండగూడ గ్రామానికి చెందిన గర్భిణీ సవితకు మంగళవారం 108 అంబులెన్స్‌లో సుఖ ప్రసవం జరిపినట్లు 108 ఈఎంటీ దత్తాత్రేయ, పైలెట్ మడావి బాపూరావు తెలిపారు. సవితకు పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్ ద్వారా ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి గర్భంలోని బిడ్డ కదలికలు తగ్గినట్లు గుర్తించి ప్రసవం కష్టమవుతుందని సూచించడంతో మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించేందుకు నిర్ణయించారు. అయితే రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో సీతాగొంది సమీపంలో నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కన నిలిపి ప్రసవం నిర్వహించారు. ఈ సమయంలో బిడ్డకు మెడ చుట్టూ బొడ్డు తాడు ఉండటాన్ని గమనించి చాకచక్యంగా తొలగించి సురక్షితంగా ప్రసవం చేశారు. కాగా సవిత మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. అనంతరం తల్లి, బిడ్డలను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని, ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నారని వివరించారు.

# పట్టణ అభివృద్ధియే ప్రధాన లక్ష్యం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణాభివృద్దే తన ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బ్లేడ్ ట్రాక్టర్ ను ప్రారంభించారు. మున్సిపల్ పాలన పరమైన అవసరాల కోసం కొనుగోలు చేసినట్టు తెలిపారు. అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డితో కలిసి మంత్రులకు నిధుల కోసం విన్నవించినట్టు పేర్కొన్నారు. విడతల వారీగా నిధులు వస్తాయన్నారు. మొత్తం 49 వార్డులు పర్యటించి అవసరమున్న చోట మౌళిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. అన్ని వార్డులు అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# పంట సాగులో మెలుకువలు పాటించాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రైతులు పంట సాగులో మెలుకువలు పాటించి పంట అధిక దిగుబడి రాబాట్టాలని వడూర్ గ్రామ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని వడూర్ గ్రామ రైతు వేదికలో నానో యూరియా, నానో, డిఏపి ఎరువుల వాడకం పట్ల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరవుల వాడకంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ స్వర్ణలత, శాస్త్రవేత్తలు, ఆత్మ డైరెక్టర్ శంకర్, గ్రామస్తులు రాములు, శేఖర్, శంకర్, లింగన్న, నవీన్, అశోక్, బబ్లూ, సజిత్, భోజన్న తదితరుల పాల్గోన్నారు.

# వివాహ వేడుకల్లో డీసీసీ అధ్యక్షురాలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క సోమవారం రాత్రి పలు వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సిర్పూర్(యు) మండలం అమృత్‌రావుగూడలో మడావి కుటుంబానికి చెందిన వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జైనూర్ మండలం కర్ణంగూడ గ్రామంలో గేడం కుటుంబానికి చెందిన వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహం అనేది రెండు కుటుంబాలను కలిపే పవిత్ర బంధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీతాగొంది సర్పంచ్ కొట్నాక్ బాపూజీ, పంగిడి సర్పంచ్ మీరాబాయి జాలింశావ్, పుల్లార ఉప సర్పంచ్ రాజు, తొడసం లింగు పటేల్, ఆత్రం రాహుల్, దత్తు, మహమ్మద్, సంతోష్, పట్నాపూర్ సర్పంచ్ బాలాజీ, మన్నుగూడ మాజీ సర్పంచ్ గేడం దిగంబర్, నాయకులు గేడం గోపీచంద్, సంజు, హనుమంతరావు, గేడం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి జూపల్లికి కృతజ్ఞతలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బోథ్ పట్టణ కేంద్రంలో ఫైర్ స్టేషన్ మంజూరు కోసం మంత్రి చేసిన కృషికి కృతజ్ఞతగా కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోథ్ ప్రాంత అభివృద్ధి కోసం మంత్రి జూపల్లి తీసుకుంటున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ఫైర్ స్టేషన్ ఏర్పాటు ద్వారా అత్యవసర సేవలు మరింత వేగంగా అందుబాటులోకి వచ్చి ప్రజలకు ఉపయోగపడుతాయని తెలిపారు. ఆయన వెంట నాయకులు తుల అరుణ్, జెల్కే పాండురంగ్, భూమన్న తదితరులు ఉన్నారు.

# ఏసీబీ వలకు చిక్కిన వైరా ఎంవిఐ




**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఏసీబీ వలకు అవినీతి చేప చిక్కింది. ఖమ్మం జిల్లా వైరా మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ (ఎంవీఐ) ఎ.వరప్రసాద్ ను ఏసీబీ అధికారులు రెడ్ అరెస్ట్ చేశారు. ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.24,800 మొత్తాన్ని లంచంగా తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని, అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ వెల్లడించారు. పెనుబల్లి నుంచి ఖమ్మంకు ఇటుక తరలించేందుకు నాలుగు ట్రాక్టర్లు, ఐదు టిప్పర్ల నుంచి నెలకు రూ.24,800 మొత్తాన్ని ఎంవీఐ వరప్రసాద్ డిమాండ్ చేసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో బాధిత కాంట్రాక్టర్ తమను ఆశ్రయించగా, వలవేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వైరాలోని తన కార్యాయలంలోనే వరప్రసాద్ లంచం స్వీకరిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు.

# ప్యాక్స్ మాజీ చైర్మన్‌కు ఘన నివాళి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా అనుకుంటా గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మంచాల పోతన్న యాదవ్ ఇటీవల మృతిచెందారు. ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మంగళవారం వారి నివాసానికి వెళ్లి పోతన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సోదరుడు మంచాల మల్లయ్య యాదవ్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ అధికార ప్రతినిధి బాలూరి గోవర్ధన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బండి దేవదాస్ చారి, కార్యదర్శి గౌలి సంజయ్, సీనియర్ నాయకులు బూపెల్లి శ్రీధర్, సోమన్న, తొడసం దౌలత్ రావు, చిట్యాల గంగన్న, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# రాజ్యసభ సభ్యుడితో భేటీ



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, 40వ వార్డు కౌన్సిలర్ చరణ్ గౌడ్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో భేటీ అయ్యారు. మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో 900 ఓట్లపై చిలుకు, అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన చరణ్ గౌడ్ ను అభినందించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువ నాయకత్వం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చరణ్ గౌడ్ మాట్లాడుతూ వారి మాటలు నాలో మరింత ఉత్సాహాన్ని నింపాయని తెలిపారు. వారి ఆశీస్సులు, సహకారంతో ప్రజా సేవలో మరిన్ని అడుగులు ముందుకు వేస్తానని పేర్కొన్నారు.

# సీఎస్సీ హెల్త్ టెస్టుల పేరుతో కోట్ల సొమ్ము స్వాహా

- బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సీఎస్సీ పేరుతో లేబర్ కార్డులు పొందిన భవన, ఇతర నిర్మాణ కార్మికుల వద్ద హెల్త్ టెస్టుల పేరుతో కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేస్తున్నారని సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్ ఆరోపించారు. మంగళవారం సత్తుపల్లి పట్టణంలోని పలు భవన నిర్మాణ కార్మికుల అడ్డాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత హెల్త్ టెస్టుల పేరుతో కార్మికుల వద్ద రక్త పరీక్షలు నిర్వహించి తప్పుడు నివేదికలు ఇచ్చి భయాందోళనలకు గురిచేస్తున్నారని అన్నారు. అనుభవం లేని సీఎస్సీ సంస్థతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు పథకాల్లో మరణ సహాయాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించడం సరికాదని, వెంటనే ఆ లీజును రద్దు చేయాలని కోరారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రసూతి, వివాహ కానుకలను రూ.30వేల నుంచి రూ.1లక్షకు పెంచాలని, సహజ మరణ సహాయాన్ని రూ.2లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెన్షన్ కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని, బ్రోకర్ల వ్యవస్థను ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 30న బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లేబర్ కమిషనరేట్ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కావూరి వెంకటేశ్వరరావు, పట్టణ నాయకులు స్వప్నవీసు చరణ్ కుమార్, బాలమర్తి భాస్కర్, సత్తార్ తదితరులు ఉన్నారు.

# దళారుల దగా నుంచి రైతులను కాపాడాలి

- పంటలను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలి
- సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రైతులు పండించిన దాళ్వా వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల కేంద్రంలోని ఎర్రా రామయ్య భవనంలో మోరంపూడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఆసరాగా చేసుకొని దళారులు రైతులను మోసం చేస్తూ క్వింటాకు సుమారు రూ.350 వరకు తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, దళారుల దగా నుంచి రైతన్నలను ప్రభుత్వం కాపాడాలని కోరారు. అదేవిధంగా సత్తుపల్లి మండల పరిధిలోని సిద్దారం, గౌరీగూడెం, సదాశివునిపాలెం, వేంసూరు మండలంలోని లింగపాలెం తదితర గ్రామాల్లో నకిలీ వరి విత్తనాలు అమ్మి రైతులను మోసం చేసిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విత్తన తయారీ సంస్థలపై పీడీ యాక్ట్ నమోదు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. లేనియెడల రైతాంగాన్ని రాజకీయాలకు అతీతంగా సమీకరించి పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు, సీనియర్ నాయకులు అర్వపల్లి గోపాలరావు, కొత్తా సత్యనారాయణ, మల్లూరు చంద్రశేఖర్, అర్వపల్లి వెంకటేశ్వరరావు, గడిపర్తి మోహన్ రావు, చీపి రామకృష్ణ, పుచ్చకాయల వెంకటేశ్వరరావు, కావూరి సుదర్శనం, ఐద్వా నాయకురాలు శీలం కరుణ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో 'బుల్లెట్' బీభత్సం

- శబ్ద కాలుష్యంతో బెంబేలెత్తుతున్న పట్టణవాసులు




**ఉద్యమ కెరటం, సత్తుపల్ల:** సత్తుపల్లి పట్టణంలో బుల్లెట్ బైక్ల వికృత శబ్దాలు సామాన్య ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కంపెనీ సైలెన్సర్లను తొలగించి, నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చే 'మోడిఫైడ్' సైలెన్సర్లను అమర్చుకుని కొందరు యువకులు రోడ్లపై స్వైరవిహారం చేస్తున్నారు. బాంబు పేలినట్లుగా వచ్చే ఈ శబ్దాల ధాటికి పట్టణవాసులు, ముఖ్యంగా వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు.

**గుండె పగిలేలా శబ్దాలు..**


నిబంధనల ప్రకారం వాహనాల శబ్ద తీవ్రత 80 డెసిబుల్స్ మించకూడదు. కానీ పట్టణంలో తిరుగుతున్న బుల్లెట్ బైక్లు ఈ పరిమితిని దాటి భయంకరమైన శబ్దాలు చేస్తున్నాయి. ఈ హఠాత్తు శబ్దాలతో వృద్ధులు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. చిన్న పిల్లలు సైతం ఉలిక్కిపడి నిద్రలో ఏడుస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల మౌనంపై ఆగ్రహం..**

పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఇంత జరుగుతున్నా అటు పోలీస్ యంత్రాంగం గానీ, ఇటు మున్సిపల్ అధికారులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి వేళల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది. పోకిరీల ఆగడాలను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం సైలెన్సర్లు మార్చడం చట్టరీత్యా నేరం. నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉన్నప్పటికీ, సత్తుపల్లిలో మాత్రం నిబంధనలు అమలు కావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ సైలెన్సర్లను తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# నల్లకుంట కట్ట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ఉద్యమ కెరటం, హత్నూర:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నల్లకుంట, బోడకుంట అలుగు కట్టలను ధ్వంసం చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని హత్నూర మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు తలాలి రాజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం దౌల్తాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేందర్ రెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి వనరుల రక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడుతుండగా, చందాపూర్ గ్రామ పరిధిలోని ఓ రియాల్టీ సంస్థ యాజమాన్యం తమ అవసరాలకు అనుగుణంగా నల్లకుంట కట్ట, అలుగులను ధ్వంసం చేసి రోడ్డు వేసినట్లు ఆరోపించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



# అక్రమ ఇసుక నిల్వ లు సీజ్



**ఉద్యమ కెరటం, హత్నూర:** మండలంలోని పన్యాల, బడంపేట గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు మంగళవారం తహశీల్దార్ పర్వీన్ షేక్ తెలిపారు. మంజీరా నది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ కొందరు వ్యక్తులు నిల్వలు చేస్తున్నట్లు గుర్తించి ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గతంలో కూడా అక్రమ ఇసుక నిల్వలను సీజ్ చేసి వేలం పాట నిర్వహించినట్లు చెప్పారు. ప్రస్తుతం సుమారు 150 నుంచి 200 లారీల వరకు ఇసుక నిల్వలు ఉన్నాయని, అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి తరలించిన వారిపై వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. సీజ్ చేసిన ఇసుక విలువ లక్షలాది రూపాయలు ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాహుల్ నాయక్, జీపీఓలు సాయి కుమార్ గౌడ్, రాజు, రమేష్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

